క్లుప్తంగా

ఎంపీ మాగుంటతో ఎమ్మెల్యే భేటీ


ఎంపీ మాగుంటతో మాట్లాడుతున్న గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు

ఒంగోలు: ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని గిద్దలూరు ఎంఎల్‌ఏ అన్నా రాంబాబు కలుసుకున్నారు. మంగళవారం రాత్రి స్థానిక ఎంపీ కార్యాలయంలో మాగుంటతో ఎమ్మెల్యే అన్నా రాంబాబుబు పలు విషయాలపై కార్యాలయంలో మాట్లాడారు.

యువకుడిపై దాడి

ఒంగోలు టౌన్: ఓ యువతి విషయంలో జరిగిన గొడవ చివరికి ఘర్షణకు దారి తీయగా ఒకరికి గాయాలయ్యాయి. జయప్రకాష్ నగర్‌లో నివశించే రామాంజి, అతడి సోదరుడు సాయికి, అదే కాలనీకి చెందిన మోటా నవీన్ అనే యువకుడికి మధ్య సోమవారం రాత్రి ఘర్షణ జరిగింది. అనంతరం రామాంజి, సాయిలతో పాటు మరో ముగ్గురు కలిసి నవీన్‌పై దాడి చేసి కొట్టారు. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే రిమ్స్‌కు, అనంతరం మెరుగైన చికిత్స కోసం నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని సమాచారం. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇరువర్గాల వారు పాత నేరస్తులని సమాచారం

ఉరుములు మెరుపులతో కూడిన వర్షం

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడులో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఉరుములు మెరుపులతో కూడి వర్షం జోరుగా పడింది. గత మూడు రోజులుగా ఊరిస్తున్న వర్షం పడటంతో ప్రజలు ఆనందించారు. గత రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉన్నా అత్యధిక వేడి ఉండటంతో మధ్యాహ్న సమయంలో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మంగళవారం కురిసిన జోరువానకు వాతావరణం చల్లబడినట్లే. వేసవి తాపం తీర్చే విధంగా వర్షం కురవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డిప్యూటీ డ్యూటీ మేనేజర్ కోర్సుపై శిక్షణ

ఒంగోలు అర్బన్: బీఎస్సీ, బీకాంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఉపాధి చూపేలా డిప్యూటీ డ్యూటీ మేనేజర్ కోర్సులో ఉచిత శిక్షణ అందచేసి కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.హెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు జరిగే శిక్షణ ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్ సహకారంతో బొల్లినేని మెడ్‌స్కిల్స్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 20 నుంచి 30 ఏళ్ల లోపు వయసున్న యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఉచిత వసతి, భోజనం, యూనిఫారంతో పాటు బీమా సౌకర్యం కూడా ఉందన్నారు. వివరాలకు 81255 80766, 88860 80603 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్లో అడ్మిషన్లు

కొత్తపట్నం: గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ సమీకృత బాలికల వసతిగృహంలో 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నట్లు వసతి గృహ సంక్షేమ అధికారి ఎన్. అరుణ కుమారి తెలిపారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చేరే అవకాశం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు సీట్లు ఉన్నాయన్నారు.

మంచినీటి సరఫరాలో జాప్యం

ఒంగోలు: విద్యుత్ అంతరాయం కారణంగా మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కనుక ప్రజలు గమనించి నగరపాలక సంస్థకు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ యం.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు-1, సమ్మర్ స్టోరేజీ ట్యాంకు-2 నుంచి బుధవారం సరఫరా చేయాల్సిన ప్రాంతాల్లో గురువారం, 22న పంపిణీ చేయాల్సిన వారికి 23వ తేదీ మంచినీటి సరఫరా చేస్తామన్నారు.

ఎంఈఓ బాధ్యతలు స్వీకరణ


శ్రీనివాసరావును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మద్దిపాడు: మండలంలో రెండో ఎంఈఓగా మెడబలిమి శ్రీనివాసరావు మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో బసవన్నపాలెం, గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎంగా, ఇన్‌చార్జి ఎంఈఓగా వ్యవహరించారు. పలువురు ఉపాధ్యాయ సంఘ నేతలు, ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

నూతన ఉత్తేజం


కొత్తపట్నంలో నిర్మాణంలో ఉన్న గృహాలు

అభివృద్ధి పనులు (రూ)

సచివాలయాలు	15	6.00 కోట్లు
ఆర్‌బీకేలు	15	3.27 కోట్లు
హెల్త్ సెంటర్లు	11	2.28 కోట్లు
విద్యుత్ ఆధునికీకరణ	15	22.00 కోట్లు
విద్యుత్ సబ్‌స్టేషన్		20.00 కోట్లు
సీసీ రోడ్లు		2.00 కోట్లు
బకింగ్‌హాం బ్రిడ్జి		20.00 కోట్లు
జల్ జీవన్ మిషన్		18. 60 కోట్లు
మొత్తం		94.15 కోట్లు

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- ఆర్థికంగా ఎదుగుతున్న కుటుంబాలు
- అభివృద్ధిలో ముందడుగు
- టీడీపీ హయాంలో అవినీతి పాలన



కొత్తపట్నంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం - 2

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మండల రూపురేఖలు మారాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేసి పేదల పార్టీగా అవతరించింది. దీంతో చిన్న, సన్నకారు కుటుంబాల వారు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ప్రతి కుటుంబం కళకళలాడుతోంది. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయం వంటి సంక్షేమ పథకాలపై దృష్టి సారించింది. అవనీతికి తావు లేకుండా నేరుగా వారి అకౌంట్‌లోకే సీఎం వైస్ జగన్మోహన్‌రెడ్డి అమౌంట్ నగదు బదిలీ చేస్తుండగా ఆయా కుటుంబాలు ఆర్థికంగా బలం పుంజుకోగలుగుతున్నాయి. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావడంతో జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లీనిక్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పరిపాలన సాగిస్తున్నారు. ఎక్కడా అవనీతికి తావులేకుండా పరిపాలన అందిస్తుండటంతో అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానంగా 15 పంచాయతీల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్‌క్లినిక్ సెంటర్లు, రోడ్లు, బకింగ్‌హామ్ బ్రిడ్జి , విద్యుత్ స్తంభాలు, వైర్లు, టవర్లు, 132/33 సబ్‌స్టేషన్ నిర్మాణం చేస్తున్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు.

టీడీపీ అంతా అవినీతిమయం

టీడీపీ ప్రభుత్వంలో కార్యకర్తలు అవినీతికి పాల్పడ్డారు. కేవలం కార్యకర్తలు బతకటానికి పథకాలు అమలు చేశారు. అనుమాలు లేకుండా పనులు చేసి జేబులు నింపుకున్నారు. ప్రజలకు ఉపయోగ పడని పథకాలు అమలు చేశారు. దీంతో ప్రజలు ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పారు. ఇక నీరు–చెట్టు పథకంలో రూ.2 కోట్లను కార్యకర్తలు స్వాహా చేశారు. నాడెప్ కంపోస్టు పేరుతో రూ. 18 లక్షలు, రూఫ్ హార్వెస్టింగ్ ఫీట్లు నిర్మాణం చేపట్టి రూ.22.46 లక్షలు దోచుకున్నారు. నాసిరకం మరుగుదొడ్ల నిర్మాణంతో లక్షలు దోచుకున్న కార్యకర్తలు.. ఇలా ఎన్నో అక్రమాలు చోటు చేసుకున్నాయి.

మండలంలో ఇలా..

సంఖ్య	పథకాలు	టీడీపీ	నగదు (రూ)	వైఎస్సార్ సీపీ	నగదు (రూ)
1.	పింఛను నెలకు	5,242	58,00,500	7,842	2,15,45,500
2.	మత్స్యకార భరోసా	5,300	2,12,00,000	19,090	19,90,00,000
3.	అమ్మ ఒడి	-	-	4,720	6,13,6,000
4.	ఇళ్ల పట్టాలు	-	-	1,200	6,12,00,000
5.	వైఎస్సార్ ఆసరా	1,090	6,35,58,00	1,208	27,57,25,669
6.	రైతు భరోసా	-	-	16,799	20,09,29,000

‘ఆణిముత్యాల’కు బహుమతులు


త్రోవగుంటలో బహుమతులు ఇస్తున్న హెచ్ఎం చల్లా బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు


చీమకుర్తిలో విద్యార్థినిలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందిస్తున్నఉపాధ్యాయులు

చీమకుర్తి: గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించిన జగనన్న ఆణిముత్యాలకు మంగళవారం చీమకుర్తి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నగదు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్లను హెచ్ఎం జి.వీరాస్వామి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. బోడిపాగ త్రిష, గల్లె పాగ రూతు, కొమ్ము వైష్ణవి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరం నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి నగదు బహుమతులుగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000తో పాటు మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు.

పేర్నమిట్టలో..

పేర్నమిట్ట జిల్లా పరిషత్ హైస్కూలులో జగనన్న ఆణిముత్యాల ద్వారా ఎంపికైన తిరగబత్తిన స్వాతి, బండి నవ్య, జి.మేఘనాదేవిలకు ప్రధానోపాధ్యాయురాలు పార్వతి శాంతి చేతుల మీదుగా నగదు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

ఒంగోలు రూరల్: జగనన్న ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థినిలకు త్రోవగుంట జిల్లా పరిషత్ హైస్కూలు హెచ్ఎం చెల్లా బ్రహ్మయ్య పురస్కారాలు అందజేశారు. రూ.3000, రూ.2000 రూ.1000 వరుస బహుమతులతో పాటు మెడల్స్, ప్రశంస పత్రాలను అందజేశారు. భవిష్యత్తులో ఈ విద్యార్థులు మంచి పురోగతి సాధించాలనికోరారు.


పేర్నమిట్టలో అందిస్తున్న టీచర్లు

ప్రతిభా విద్యార్థులకు సత్కారం


విద్యార్థులను సత్కరిస్తున్న పద్మశాలీయుల ఉద్యోగులు

చీమకుర్తి: పద్మశాలీయులకు చెందిన పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల్లో ప్రతిభను ప్రదర్శించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉన్న వారిని పద్మశాలీయుల ఉద్యోగుల సంఘం మంగళవారం చీమకుర్తిలో ఘనంగా సత్కరించారు. పదిలో తిరువీధుల భానుశ్రీ, దాసరి సాయి ప్రజ్ఞ, ఇంటర్‌లో సోమా హర్ష నాగమణి వర్ధన్, శీలం గోపీచంద్‌లను నగదు పురస్కారంతో పాటు మెడల్, ప్రశంసపత్రంతో సత్కరించారు. అలాగే గత విద్యాసంవత్సరంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును పొందిన జెట్ల రవికుమార్‌ను, నూతనంగా ప్రభుత్వ డాక్టర్ ఉద్యోగంలో చేరిన గుంటి ఫణి ఈశ్వర్‌ను శాలువాలతో సత్కరించి అభినందించారు. పద్మశాలీయుల ఉద్యోగుల సంఘ సభ్యులు, పద్మశాలీయుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ

చీమకుర్తి:టైలరింగ్ కోర్సులో మహిళలకు ఉచితంగా మూడు నెలలు పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతనూతలపాడు ఎండ్లూరు డొంకలోని మహిళా ప్రాంగణంలో శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రమాద బీమాకు దరఖాస్తు చేసుకోండి

ఒంగోలు: నగరంలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ, జర్నలిస్టులకు రూ. 10 లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఓ.వసంతకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈనెల 30వ తేదీలోపు తమ పేర్లను 9440925092 లేదా 9182095153 సెల్ నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

వర్షం.. హర్షం


జోరు వానలో మోపెడ్.. దానిపై గొడుగు ఉంటేనే హాయి..


ఇప్పటిదాకా ఎండల్లో బాధ పడుతూ అమ్మకాలు చేసిన మామిడి వ్యాపారి కాస్త చల్లబడ్డాడు..


మంచి వాన కురిసింది.. రోడ్లన్నీ ఫుల్లు.. చల్లదనం మెండు

23 నుంచి గడప గడపకు వలంటీర్లు

- సమస్యలను అధ్యయనం చేయడమే లక్ష్యం
- సాంకేతిక సమస్యల పరిష్కారానికి చర్యలు
- జూలై 7న పత్రాల పంపిణీకి చర్యలు
- పథకంలో అర్హుల జాబితా ఆగస్టు 1న విడుదల


మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్

ఒంగోలు: గడప గడపకు వెళదాం.. కుటుంబ సభ్యులను పలుకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుందాం.. సాంకేతిక సమస్యలు ఏమైనా ఉంటే వాటిని పరిష్కరించి వారికి అవసరమైన పత్రాలను అందించేందుకు చర్యలు చేపట్టాలి అని నగరపాలక సంస్థ కమిషనర్ యం.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక 9వ డివిజన్ సచివాలయంలో ఆయన సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్షా పథకం లక్ష్యాలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు, అవసరమైన సర్టిఫికెట్లకు సంబంధించి సమస్యలు ఏవైనా ఉంటే వాటిని తెలుసుకుని సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తూ వారి సమస్య పరిష్కారంలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. నెల రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జూలై 1 నుంచి సచివాలయాల పరిధిలో క్యాంపులు నిర్వహించి ఈ పథకంలో అర్హులు అయిన వారిని ఆగస్టు ఒకటిన ప్రకటించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముందుగా వలంటీర్లు వారి పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్ళాలన్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని సర్టిఫికెట్ల జారీకి సంబంధించి సమస్యలు ఉంటే వాటిని నమోదు చేసుకోవాలని, వీరికి జూలై 1న సచివాలయాల క్యాంపుల ద్వారా వెంటనే వారికి సర్టిఫికెట్లు జారీ చేయడం జరుగుతుందన్నారు. కులధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, మరణ ధ్రువీకరణ పత్రం, ఫ్యామిలీ సర్టిఫికెట్, లావాదేవీ బదిలీలు, ఆధార్‌కి ఫోన్ నెంబర్ లింక్ చేయడం వంటి డాక్యుమెంట్లు/ సర్టిఫికెట్లు వంటి వాటికి ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. ప్రజలు తమకు అవసరమైన పత్రాలకోసం ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్ళేవారని, కానీ వారికి అవసరమైన పత్రాల మంజూరుకు ప్రభుత్వమే ప్రజల వద్దకు వస్తున్న గొప్ప జగనన్న సురక్ష పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా చేయూతనిద్దామని పిలుపునిచ్చారు. అర్హులైన వారికి జూలై 7న రాజీవ్ గృహకల్ప సచివాలయంలో జరిగే వార్డు సభలో సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. 9వ డివిజన్ కార్పొరేటర్ వెన్నపూస శోభారాణి వెంకటరెడ్డి, రాజీవ్ గృహ కల్ప సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ఓ వరం


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సుజాత

కొత్తపట్నం: జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, వలంటీర్లు భాగస్వాములై విజయవంతం చేస్తే సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతామని ఎంపీడీఓ డాక్టర్ పి.సుజాత పేర్కొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఈతముక్కల 1,2, మడనూరు 1,2, అల్లూరు 1,2, ఆలూరు, గుండమాల, మోటుమాల గ్రామ సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టిందన్నారు. దీని ముఖ్య ఉద్దేశం గ్రామంలో సందర్శించి మిగిలిపోయిన సమస్యలను గుర్తించి తొమ్మిది రకాల సర్వీసులు అందజేసి పరిష్కరించడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. భర్త, డెత్, మేరేజ్, సీసీఆర్‌సీ వివిధ రకాల సర్టిఫికెట్లు అప్పుడే ఇచ్చే చర్యలు తీసుకుంటారని చెప్పారు. వలంటీర్లు ప్రతి గృహాన్ని సందర్శించి అవసరమైన వారికి అనుసంధాన డాక్యుమెంట్లు తీసుకుని వలంటీర్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. తొమ్మి సర్వీసులతో పాటు ఏ కుటుంబానికి సంక్షేమ పథకాలు రాని వారి అర్జీలు కూడా తీసుకోవాలని సూచించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఆగస్టు 1వ తేదీన లబ్ధి చేకూరే విధంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. తహసీల్దార్ బీఈ రమణారావు మాట్లాడుతూ మీ సమస్య కార్యాలయాలు చుట్టూ తిరగకుండా మీ ఇంటికే వచ్చే మీ సమస్యలు పరిష్కరించడం అనేది గొప్ప విశేషమని ప్రజలు సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరారు. తొమ్మి సర్వీసులతో పాటు రెవెన్యూ సంబంధించిన సమస్యలు, ఏ సమస్యలు ఉన్నా అర్జీ రూపంలో తెలియపరచాలని తెలిపారు. సున్నా నుంచి 5 సంవత్సరాల పిల్లలకు, ఆరు నుంచి 19 సంవత్సరాల పిల్లలకు భర్త సర్టిఫికెట్లు లేదంటే అర్జీ పెట్టుకున్న వెంటనే ఇస్తామని చెప్పారు. చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు ఆధార్ కార్డులు కూడా ఇస్తామన్నారు. ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, డిప్యూటీ తహసీల్దార్ కె.అర్జున్‌రెడ్డి, వీఆర్వో వినోద్ కుమార్, జూనియర్ సహాయకులు ఎస్. ఆదిత్య పవన్, సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన


పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు: స్థానిక 49వ డివిజన్ సత్యన్నారాయణపురంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ యం.వెంకటేశ్వరరావు పరిశీలించారు. కాలువలలో ఎటువంటి వ్యర్థాలు లేకుండా నీటిపారుదల ఉండేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ కార్యదర్శికి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. హోటల్స్, వ్యాపారస్తులు కూడా వారికి సంబంధించిన చెత్తను రోడ్లపైన లేక కాలువల్లో వేయకుండా అవగాహన కల్పించాలన్నారు. చెత్తను ప్రతి ఇంటి నుంచి తప్పనిసరిగా వారి వద్దకు వస్తున్న క్లాప్ ఆటోకి ఇవ్వాలన్నారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న శానిటేషన్ పనుల గురించి అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. క్లాప్ ఆటోకి చెత్త అందిస్తున్న విధానాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రజలు తప్పనిసరిగా మూడు బుట్టల విధానం ద్వారా చెత్తని వేరుచేసి క్లాప్ ఆటోకి ఇవ్వాలన్నారు. అన్ని కలిపి ఒకే బుట్టలో ఇవ్వడం వల్ల చెత్తను వేరు చేయడానికి కష్టం అవుతుందన్నారు. తడిచెత్తను వర్మీకంపోస్టులకు, పొడి చెత్తను జిందాల్ ఎనర్జీ ప్లాంటుకు తరలిస్తామని చెప్పారు. మూడు బుట్టల చెత్తను సేకరించడం గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని, సచివాలయాల శానిటేషన్ సెక్రెటరీని ఆదేశించారు. వలంటీర్ల ద్వారా ఈ కార్యక్రమాన్ని మిక్కిలిగా ప్రజల్లోకి తీసుకువెళ్ళాలన్నారు. క్లాప్ యూజర్ ఫీజు కలెక్షన్‌లో పురోగతి కోసం ప్రత్యేక ప్రణాళిక అమలుచేయాలన్నారు. 49వ డివిజన్ కార్పొరేటర్ అంగిరేకుల గురవయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మిరయం శ్రీను, శానిటరీ మేస్త్రి పాల్గొన్నారు.